క్లుప్తంగా

పండ్ల తోటల్లో కందకాల ఏర్పాటు



నాయరాళ్లవలసలో పండ్ల తోటలకు వేసిన కందకాలను పరిశీలిస్తున్న ఏపీఓ హరనాథ్

రేగిడి: ఉపాధిహామీ పథకం ద్వారా రైతులు సాగు చేస్తున్న పండ్ల తోటలకు కందకాలను ఏర్పాటు చేసుకోవాలని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని నాయరాళ్లవలస, లచ్చన్నవలస, గుళ్లపాడు, ఉంగరాడ తదితర గ్రామాల్లో రైతులు పండ్ల తోటలకు ఏర్పాటు చేస్తున్న కందకాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కందకాలు ఏర్పాటు చేసుకోవడం వలన దిగుబడులు పెరగడంతో పాటు మొక్క ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. వర్షాలు కురిసేటప్పుడు నీటిని నిల్వ చేసుకునేందుకు ఈ కందకం ఎంత ఉపయోగపడుతుందన్నారు.

పంటపొలాలకు రోడ్డు నిర్మాణం



కొత్తగా నిర్మించిన గ్రావెల్ రోడ్డు

రేగిడి: మండలంలోని వండానపేట గ్రామంలోని పంటపొలాలకు రహదారిని ఏర్పాటుచేశారు. పంచాయతీ సర్పంచ్ వియ్యపు లావణ్య చక్రపాణి పంచాయతీ నిధులతో కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. వ్యవసాయ పనుల్లో భాగంగా రైతులు తమ పంటపొలాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన సర్పంచ్ రూ.2 లక్షలు ప్రతిపాదనలతో కిలోమీటరు మేర గ్రావెల్ రోడ్డును నిర్మించినట్లు తెలిపారు.

పంట తెగుళ్లపై అప్రమత్తం

వంగర: పంటదశకు చేరుకున్న వరిపంటకు తెగుళ్లు ఆశించకుండా చూసుకోవాలని ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు. మండలంలోని మద్దువలసలో మంగళవారం పర్యటించి వరి పంట పొలాలను పరిశీలించారు. వెన్నుదశలో సోకే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్లను సకాలంలో గుర్తిస్తే పంటనష్టాన్ని నివారించొచ్చన్నారు.

ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా



ట్యాంకర్ వద్ద నీటిని పడుతున్న మహిళలు

రాజాం సిటీ: మండలంలోని మొగిలివలస గ్రామంలో యువత ఆధ్వర్యంలో మంగళవారం మంచినీటి సరఫరా చేశారు. రాజాం ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా జీఎంఆర్ కేర్ జంక్షన్ వద్ద పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో గత ఇరవై రోజులుగా గ్రామానికి కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులకు నీటి సరఫరా విషయమై పలుమార్లు విన్నవించుకున్న ఫలితం లేకపోవడంతో యువకులు లెంక అప్పలనాయుడు, లెంక గణేష్, మజ్జి హరి, మీసాల అనీల్, మజ్జి జనలు తమ సొంత నిధులతో నీటి సరఫరా చేసేందుకు ముందుకొచ్చారు. మంగళవారం నుంచి ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేయడంతో గ్రామస్తులకు కొంత ఊరట లభించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేసి తాగు నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జోరుగా రహదారి నిర్మాణ పనులు



కొత్తగా వేసిన తారురోడ్డు

మెంటాడ: అనకాపల్లి-రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రం మీదుగా జరిగే ఈ నిర్మాణానికి అవసరమైన భూములను రైతులు ఇప్పటికే ఇవ్వడంతో నిర్మాణం చకచకా జరుగుతోంది. ప్రస్తుతం తారురోడ్డు వేస్తుండగా, 25 కిలోమీటర్ల మేర నిర్మాణం పూర్తయిందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది వేసవి నాటికి రహదారి పూర్తిచేసి, జాతికి అంకితం చేయడం జరుగుతుందన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబకండి, సంకిలి తదితర గ్రామాల్లో వెలసిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలస ఆలయ పూజారి కిన్నెర కాంతం అన్నారావు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, పుష్పార్చనలు చేశారు.



భామిని: సింగిడిలో శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత



గరుగుబిల్లి: నాగూరుకు చెందిన నఖచిత్రకారుడు పరిసినాయుడు వేసిన మహిషాసురమర్దిని వర్ణ చిత్రం



వీరఘట్టం: భక్తుల చే పూజలందుకున్న కోటదుర్గమ్మ



కురుపాం: నేరేడువలసలో మాలతమ్మ ప్రతిమను తలపై పెట్టుకుని, ఊరేగుతున్న ఎస్ఐ ప్రసాద్



భామిని: బత్తిలిలో విజయదశమి పూజల్లో వైఎస్సార్ సీపీ నాయకులు సింహాచలం, అన్నాజీరావు



కురుపాం: కోటదుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

దసరా సరదా

గ్రామగ్రామాన దసరా సరదా, సందడి కనిపించాయి. విజయదశమి వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇదేరోజున దుర్గమ్మను పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఉదయాన్నే మహిళలు తలంటు స్నానమాచరించి, ఆలయాలకు వెళ్లి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, దీపారాధనలు, అభిషేకాలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలు, సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. వాహనదారులు అమ్మవారి సన్నిధిలో తమ వాహనాలకు పూజలు చేసి, కోళ్లు, మేకలను బలిగా ఇచ్చారు. అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నారు. పలుచోట్ల చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. –సాక్షి నెట్‌వర్క్.



సీతంపేట: సీతంపేట పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



గరుగుబిల్లి: నాగూరులో దుర్గమ్మ మండపంలో భవానీ భక్తుల పూజలు



భామిని: కోటదుర్గమ్మ ఉత్సవ విగ్రహ ఊరేగింపు



భామిని: బత్తిలిలో కోటదుర్గమ్మకు పూజలు చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు దంపతులు

ఆర్థికసాయం అందజేత

భామిని: మండల కేంద్రంలో వీఆర్ఏ ఇప్పిలి రెయ్యమ్మ(63) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5 వేలను ఆర్థికసాయంగా అందజేశారు. ఆమె మృతి పట్ల జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు బుడుమూరు మిన్నారావు, వీఆర్ఏలు సంతాపం ప్రకటించి, బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

లింకు రోడ్లు నిర్మించాలని కోరాం..

గుమ్మలక్ష్మీపురం: ఒడిశాకు సరిహద్దున ఉన్న తాడికొండ పంచాయతీలోని కప్పకల్లు, శిఖపరాయి, ఓడ్రుబంగి, తోట గిరిజన గిరిశిఖర గ్రామాలకు ఒడిశా రాష్ట్రానికి లింకు రోడ్లు నిర్మించాలని సర్పంచ్ మండంగి జగ్గారావు కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన లింకు రోడ్ల నిర్మాణ విషయమై ఒడిశాలోని కొరాపుట్ ఎంపీ సప్తగిరికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. రెండు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగకరమైన రోడ్ల నిర్మాణంపై ఆయన కూడా సానుకూలంగా స్పందించారని, అయన తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.



కొరాపుట్ ఎంపీ సప్తగిరికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ జగ్గారావు

కోతకు సిద్ధంగా వరి పంట



లక్ష్మీపురంలో కోతకు సిద్ధంగా వరి పంట

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో రైతులు వరి పంట కోతకు సిద్ధమయ్యారు. బోర్లు, సీతానగరం సాగునీటి ప్రాజెక్ట్, తోటపల్లి కాలువ పరిసర గ్రామాల రైతులు వరిఉభాలు ముందుగా చేయడంతో పంటకోతకు సిద్ధమైంది. దీంతో రైతులు కోత పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయమై మండల వ్యవసాధికారి ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా సాగునీటి వనరులున్న గ్రామాల రైతులు తేలిక పాటి రకాలవరి విత్తనాలు వేయడంతో నారు వేసిన 25 రోజులకే వరినారు తీసి ఉభాలు చేయడంతో పంటకోతకు వచ్చిందన్నారు. ఈ నెలాఖరులోగా 1.500 ఎకరాల్లో వరిచేను కోయనున్నట్లు చెప్పారు. వరిచేలు కోతకు రావడంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నామని తెలియజేవారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ రూరల్: ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు తోడ్పడాలని సీఐ కె.మురళీధర్ తెలిపారు. సోమవారం పాలకొండ-వీరఘట్టం రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టిన ఆయన అధికలోడు, అతివేగంతో వాహనాలు నడపవద్దన్నారు. రోడ్డుపైకి వాహనాలతో వచ్చేటప్పుడు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. మద్యం తాగి వాహనం నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి, మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారికి అపరాధ రుసుం విధించారు.

వైభవంగా గ్రామదేవత పండగ



ఆకట్టుకున్న కోలాటం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో అసిరితల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని శాసపు ప్రసాదరావు ఇంటి నుంచి ఘటాలతో అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. మేళతాళాలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి వనంకు చేరుకున్నారు. గ్రామదేవత పండగకు వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులు, బంధువులు, స్నేహితుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

బొబ్బిలి: మండలంలోని గున్నతోటవలసలో మజ్జిగౌరీదేవి ఆలయ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో చల్లగా ఉండేలా దీవించమని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.

ఎంఆర్‌పీఎస్ ఆందోళన

భామిని: ఎస్సీ వర్గీకరణ చేయాలని మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ నేతలు, కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేపట్టారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు తీర్మానం ప్రవేశపెట్టి, ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందాకృష్ణ మాదిగ ఆలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన మహాపాదయాత్రకు మద్దతుగా తాము ఈ కార్యక్రమం చేపట్టామని ఎంఈఎఫ్ అధ్యక్షుడు కవిటి నూకరాజు, ఎంఆర్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు లోపింటి కృష్ణ, అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు తెలిపారు. ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మహాపాదయాత్ర మహాసభకు అందరూ తరలిరావాలని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా హక్కులపై నినదించాలని పిలుపునిచ్చారు. అనంతరం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.



ఆందోళన చేస్తున్న ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు

క్రీడలతో మానసిక ఉల్లాసం

• ఎంపీపీ కుంబురుక దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం:

క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కుక్కిడి గ్రామంలో ముత్యాలమ్మ తల్లి మెగా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటపాటల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులంతా క్రీడాస్ఫూర్తి కనబరచాలన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లోని క్రీడాప్రతిభను గుర్తించి, ప్రోత్సహించేందుకు ఈ తరహా టోర్నమెంట్‌లు ఉపయోగపడతాయన్నారు. ఈ టోర్నీలో 8 గ్రామాలకు చెందిన జట్లు పోటీపడగా, రుషిణికాలనీ, బుడ్డడుగూడ జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి, బహుమతులు కైవసం చేసుకున్నాయి.



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య

బస్‌స్టేషన్ నిర్మాణానికి కొలతలు

రాజాం:

పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన ప్రభుత్వ స్థలంలో బస్‌స్టేషన్ భవన నిర్మాణానికి మంగళవారం కొలతలు వేశారు. ఇక్కడ బస్‌స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల కిందట రూ.1.80 కోట్లు నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, పినిపే విశ్వరూప్ తదితరులు శంకుస్థాపన కూడా చేశారు. ప్రస్తుతం అన్ని అనుమతులు రావడంతో 1.42 ఎకరాల స్థలంలో 10 ప్లాట్ ఫామ్‌లతో బస్‌స్టేషన్ నిర్మించనున్నారు. 126 బస్సులు నిలిపేందుకు వీలుగా, రోజుకు సుమారు 25 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు అనువుగా దీన్ని నిర్మిస్తున్నట్లు ఆర్టీసీ డీఈఈ టీవీ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో టీపీఓ ప్రమీలారాణి, ఆర్టీసీ సూపర్‌వైజర్ కంబాల అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



బస్‌స్టేషన్ నిర్మాణానికి కొలతలు వేస్తున్న సిబ్బంది

నీరు తక్కువున్నప్పుడే ఎరువులు వేసుకోవాలి

• మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి

గరుగుబిల్లి: ఖరీఫ్ వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి సూచిస్తున్నారు.
ముఖ్యంగా సకాలంలో సరైన ఎరువులు తగినంత మోతాదులో వేయాలన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చేటప్పుడు తగినంత దిగుబడిని ఇవ్వాలంటే తప్పకుండా ఈ కింది సూచనలు పాటించాలని చెబుతున్నారు.

- కాంప్లెక్స్ ఎరువులను ఆఖరి దమ్ములోనే వేయాలి.
- తగినంత తేమ లేకుండా నత్రజని ఎరువులు వేస్తే పంటకు పూర్తిస్థాయిలో పోషకాలు అందవు.
- పంట పొలాల్లో ఎరువులు వేసినప్పుడు 2 సెంటీమీటర్ల కన్నా ఎక్కువగా నీరు ఉండకుండా చూసుకోవాలి.
- ఎరువులు చల్లిన రెండు రోజుల వరకు పొలంలో నీరు పెట్టకూడదు.
- వేసిన ఎరువులు పంట మొక్కల వేరు భాగానికి దగ్గరగా ఉండాలి.
- వేసిన ఎరువులు అలాగే పైపొరల్లో నిల్వ ఉంటే మాంగనీస్, జింక్, ఐరన్ లోపాలు తలెత్తుతాయి.
- పొటాష్ ఎరువును దమ్ములోనూ, చిరుపొట్టదశలో వేసుకుంటే మంచిది.
- పొటాష్ వేయడం వల్ల గింజ నాణ్యత బాగుంటుంది.. అలాగే పైరు రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- నత్రజని ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి.
- నత్రజని ఎరువు భూమిపై పడితే అమ్మోనియా రూపంలో ఆవిరైపోతుంది.
- తేమ ఎక్కువగా ఉంటే భూమి లోపల పొరల్లోకి వెళ్లిపోతుంది.
- కాంప్లెక్స్ ఎరువులను కలుపు తీయడానికి ముందు వేసుకుంటే కలుపుతీసిన సమయంలో తొక్కుడుకు భూమిలో కలిసి మొక్కలకు ఎరువులు పుష్కలంగా అందుతాయి.
- వేసిన ఎరువులు పంటకు అందాలంటే పొలంలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి.. లేకపోతే వేసిన ఎరువులు నేలలో కరగక గడ్డకట్టుకుపోతాయి.
- నత్రజని, భాస్వరం, పొటాష్ ప్రధాన ఎరువులను పంటలో ఎప్పుడు వేసుకోవాలనే విషయాలపై రైతులు అవగాహన కలిగివుండాలి.



పంట పొలాల్లో చల్లేందుకు ఎరువును సిద్ధం చేస్తున్న రైతు